## సభకు వచ్చే శ్రేణులకు సూచనలు

ఖమ్మం, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వేదికగా తలపెట్టిన రజతోత్సవ సభకు వచ్చే పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు.

- ఆదివారం ఉదయం నిర్దేశించిన సమయం ప్రకారం పార్టీ జెండావందనం ముగించుకొని కేటాయించిన వాహనాల్లో మాత్రమే బయలుదేరాలి.
- మీ వాహనాన్ని తోరణాలు, జెండాలు, బ్యానర్లు, నియోజకవర్గ స్టిక్కర్లతో అలంకరించుకోవాలి
- వాహనానికి సౌండ్ బాక్స్ లేదా మైక్ ఏర్పాటు చేసుకొని పాటలతో ధూంధాంగా రావాలి.
- వాహనంలో మంచినీరు, బిస్కెట్లు, పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి.
- వాహనాన్ని వేగంగా నడపొద్దు, ఓవర్ టేక్ చేయొద్దు. డ్రైవర్‌ను డిస్టర్బ్ చేయవద్దు.
- భోజనం, కాలకృత్యాల కోసం వాహనాన్ని ఆపాల్సి వస్తే రోడ్డు దించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసుకోవాలి.
- వాహనంలో వచ్చిన వారంతా బహిరంగ సభలో ఒకేచోట కూర్చోవాలి, లేకుంటే తప్పిపోయే ప్రమాదం ఉంది.
- సభా ప్రాంగణ పరిసరాల్లో టవర్ ట్రాఫిక్ వల్ల సెల్‌ఫోన్లు సరిగా పనిచేయవు. వాహనంలోని వారంతా ఒకేచోట ఉండేలా చూసుకోవాలి.
- ఎండలు ఎక్కువగా ఉండటం వద్ద వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ కండువాను తెచ్చుకోవాలి.
- తిరిగి ఇంటికి చేరే వరకు ఇన్‌చార్జికి అందుబాటులో ఉండాలి.
- ప్రతిఒక్కరూ సభా ప్రాంగణానికి చేరుకోవాలి.
- ఎవరూ వాహనంలో కూర్చోవడం గానీ లేదా కొంతదూరం వచ్చి తిరిగి వెళ్లడం కాని చేయరాదు.

## మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 26: దండకారణ్యంలో గత వారం రోజులుగా నిర్విరామంగా జరుగుతున్న సెర్చింగ్ ఆపరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జవాన్.. మందుపాతర పేలి గాయపడ్డాడు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం గలంగ్ గుట్టపై విధులు నిర్వర్తిస్తున్న బీజాపూర్ జిల్లా రిజర్వు గార్డు విభాగానికి చెందిన ఓ జవాన్.. మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై కాలు వేశాడు. దీంతో అది విస్ఫోటనం చెందింది. ఈప్రమాదంలో జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనిచిన తోటి జవాన్లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

### కాళేశ్వరం ఈఎన్‌సీ బంధువుల ఇంట్లో..
## ఏసీబీ అధికారుల సోదాలు


ఈఎన్‌సీ బంధువుల ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 26: కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ భూక్యా హరిరాంపై ఏసీబీ దాడులు జరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని అతడి బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణల్లోని ఆయన బంధువుల ఇళ్లలో కూడా సోదాలు జరిగాయి. భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ.. హరిరాం సొంతూరు కూడా. ఇక్కడ ఆయనకు నివాసం కూడా ఉంది. కాగా, ఇదే గ్రామంలోని అతడి బంధువుల ఇంటికి ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలోని పలువురు అధికారులు శనివారం ఉదయమే వచ్చి సోదాలు ప్రారంభించారు. పలు పత్రాలను పరిశీలించారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంటిపై శనివారం ఏసీబీ దాడులు జరుగగా.. ఏపీలోని పుట్టపర్తి సహా తెలంగాణలోని 15 చోట్ల ఆయన బంధువుల ఇళ్లలోనూ శనివారం ఏకకాలంగా సోదాలు కొనసాగాయి.

## మీరు ఊరెళ్తున్నారా? మాకు చెప్పండి..!
### ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 26: ఈ వేసవి సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఊరు వెళ్తున్న వారంతా.. సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో కోరారు. వేసవి సెలవుల్లో దొంగల సంచారం ఎక్కువగా ఉంటుందని, తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తారని హెచ్చరించారు. అందుకే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఊరు వెళ్తున్న వారు.. తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులకు తెలిపితే, పోలీసులు ఆయా ఇండ్లు ఉన్న ప్రాంతాల్లో గస్తీ/నిఘా వేస్తారని వివరించారు. విలువైన వాటిని బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చుకోవాలని, లేదా వెంట తీసుకెళ్లాలని సూచించారు. నివాసిత ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకుగానీ, డయల్ 100కుగానీ తెలపాలని ప్రజలను కోరారు.

## 'భూభారతి'పై నేడు సదస్సు

చుంచుపల్లి, ఏప్రిల్ 26: భూభారతి చట్టంపై ఆదివారం ఉదయం 10.00 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో రెవెన్యూ సదస్సు ఉంటుందని తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులంతా హాజరుకావాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
Wanted Service Technicians, Qualification : Diploma, ITI, (New or Experience Wanted) **Power Link's Infra Tech Pvt. Ltd.** (Genset Preferred Dealer in Telangana).
Contact No : **9384827022, 93984670322, 9966693198**

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి

బూర్గంపహాడ్, ఏప్రిల్ 26: ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఎంపీడీవో జమలా రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోరంపల్లిబంజర్ పంచాయతీ కార్యాలయంలో చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో పలు గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ పట్టాలు అందజేశారు. చేయూత ట్రస్టు చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, నేస్తం ట్రస్టు చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, చేయూత ట్రస్టు గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కైపు నాగిరెడ్డి, చేయూత ట్రస్టు సభ్యులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616




భద్రాచలం: మాట్లాడుతున్న ఆకోజు సునీల్‌కుమార్, మణుగూరు టౌన్: అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గులాబీ తోరణాలు, చర్ల: తిప్పాపురంలో..


అశ్వాపురం: రామవరంలో దిమ్మెకు గులాబీ రంగు వేస్తున్న యువత


బూర్గంపహాడ్: రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించి ప్రచారం చేస్తున్న నాయకులు

## ఎల్కతుర్తి సభకు చరిత్రలో స్థానం

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు చరిత్రలో స్థానం ఉంటుందని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇల్లెందు నియోజక వర్గం నుంచి 61బస్సులు, 40కార్లలో 4 వేల మంది వె ళ్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. ఎల్కతు ర్తి సభకు బీఆర్ఎస్ శ్రేణులు కదిలి రావాలని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సభను జయప్రదం చేయాలని మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, కరకగూడెం, పినపాక మండలాల అధ్యక్షులు రావుల సోమయ్య, పగడాల సతీశ్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో కోరారు.

- నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 26


గుండాల: రజతోత్సవ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతున్న నాయకులు


కరకగూడెం: అనంతారంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు




ఇల్లెందు: ముస్తాబయిన పార్టీ జెండా దిమ్మె, పినపాక: పార్టీ దిమ్మెకు రంగులు వేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, పినపాక: ముస్తాబైన పార్టీ కార్యాలయం..

## సీపీఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా మారెడ్డి

భద్రాచలం, ఏప్రిల్ 26: సీపీఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా మారెడ్డి శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పార్టీ కార్యాలయంలోఎస్‌వీఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎన్నిక జరిగింది. ఏఐటీయూసీ తాత్కాలిక కన్వీనర్‌గా కంభంమెట్టు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా గుంజా రామారావు, మహిళా సమాఖ్య పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా బైరు వరలక్ష్మిని పట్టణకమిటీ ఎన్నుకుంది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో ఫీవర్ సర్వే


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

దుమ్ముగూడెం, ఏప్రిల్ 26: దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలో వైద్యులు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికెళ్లి రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. 222 మందికి ఆర్‌డీటీ(రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్) నిర్వహించి ఎవరికీ మలేరియా సోకలేదని నిర్ధారించారు. పరిసరాల పరిశుభ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్‌గౌడ్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

**పెద్దపల్లిలో..**

మణుగూరు టౌన్, ఏప్రిల్ 26: మణుగూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన పెద్దపల్లిలో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. 107 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఎవరికి మలేరియా సోకలేదని నిర్ధారణ అయింది.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, కృష్ణ, శైలజ, ఆశాలు రోజా, పుష్ప, రాధ పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి సాయం

అశ్వాపురం, ఏప్రిల్ 26: మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన బండి అనిల్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తన స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని 2004–05లో పదవతరగతి చదివిన అనిల్ బాల్యమిత్రులు అందరూ కలిసి రూ.35వేలు సేకరించి శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బెదిరింపులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్య
### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మణుగూరు టౌన్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చే అవకాశం ఉందన్న ఇంటిలిజెన్స్ సమాచారంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగంగా అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులను రానియ్యకుండా ఆర్టీవో అధికారులతో బెదిరింపులకు దిగడం సిగ్గుమాలిన చర్య అని భద్రాద్రి కొత్తగూడెం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. కార్యకర్తలు వారి సొంత వాహనాల్లో సభాస్థలానికి చేరుకోవాలని తెలిపారు. గుండాల మండలానికి 3 ఆర్టీసీ బస్సులు, ఆళ్లపల్లికి 3 ఆర్టీసీ బస్సులు, కరకగూడెం మండలానికి 3 ఆర్టీసీ బస్సులు, మణుగూరు మండలానికి 3 బస్సులు, అశ్వాపురం మండలానికి 2 ట్రావెల్ బస్సులు, బూర్గంపాడు మండలానికి 3 ట్రావెల్ బస్సులు కేటాయించడం జరిగింది. దీని ప్రకారంగా మండల అధ్యక్షుడు కిందిస్థాయి నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకొని బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ మహాసభకు బయల్దేరాల్సిందిగా కోరారు.

## కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 26: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని జేఏసీ నాయకులు షేక్ యాకూబ్‌షావలి, తాళ్ళూరి కృష్ణ, రామ్‌సింగ్ డిమాండ్ చేశారు. శనివారం జేకే సివిల్ కాంట్రాక్టు కార్మికుల మస్టర్ల అడ్డా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు 30 శాతం వేతనాలను పెంచిందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచుతామని చెప్పి 17 నెలలు గడిచినా వేతనాలను పెంచకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ నెల 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట ఉదయం 9 గంటలకు నిరసనతో పాటు మహాధర్నాను జయప్రదం చేసేందుకు కాంట్రాక్టు కార్మికులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. మల్లెల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రఘు, విజయరాజేశ్వరి, ఫాతిమా, తరుణ్, జమున, సైదా, బాబురావు, దుర్గ, లింగమూర్తి, కిరణ్, సుమన్ పాల్గొన్నారు.

## వితంతువు పెన్షన్‌ను అందజేసిన జీఎం

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 26: 30 సంవత్సరాల క్రితం మృతిచెందిన మాజీ ఉద్యోగి భార్యలకు వితంతువు పెన్షన్ మంజూరు ఆర్డర్లను ఏరియా జీఎం కృష్ణయ్య శనివారం జీఎం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 1995 మార్చి 31న ఏరియా ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్న ఎండీ.తాజుద్దీన్ మృతిచెందాడన్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారన్నారు. వితంతువు పెన్షన్ కోసం వారు కోర్టును ఆశ్రయించడంతో పెన్షన్ మంజూరు కాలేదన్నారు. ఏరియా మేనేజ్‌మెంట్ ప్రత్యేక శ్రద్ధ వహించి 30 సంవత్సరాల క్రితం సంబంధించిన పెన్షన్ వివరాలను అందిస్తూ రీజనల్ కమిషనర్ సీఎంపీఎఫ్‌తో సంప్రదించారు. మృతుడు తాజుద్దీన్‌కు ఇద్దరు భార్యలైన యాకూబ్ బీ, కరిమున్నిసాబేగంకు రావాల్సిన వితంతువు పెన్షన్ ఆర్డర్లను మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రామస్వామి, అధికారులు జీవీ మోహన్‌రావు, మధుబాబు, వివిధ సంఘాల నాయకులు లచ్చిరాం, యాదగిరి, కర్క్ అపర్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎస్సై విజయలక్ష్మిని అభినందించిన డీజీపీ


ఎస్సై విజయలక్ష్మికి రివార్డు అందిస్తున్న డీజీపీ

భద్రాచలం, ఏప్రిల్ 26: భద్రాచలం పట్టణ ఎస్సై–1గా విధులు నిర్వహించిన జి.విజయలక్ష్మికి అరుదైన గౌరవం దక్కింది. మూడు రాష్ట్రాలకు అనుబంధమైన భద్రాచలం చెక్‌పోస్టు మీదుగా గంజాయి తరలివెళ్లకుండా అరికట్టడంలో తన ప్రతిభను చాటుకున్నారు. విజయలక్ష్మి కృషికి డీజీపీ శనివారం రివార్డు అందించి అభినందించారు. ఈ రివార్డుకు మొత్తం 65 మంది పోలీసులు ఎంపికవ్వగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 35 మంది పోలీసు అధికారులు ఎంపికయ్యారు. అందులో మహిళా పోలీసు అధికారిణిగా విజయలక్ష్మి ఉన్నారు.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాల్సిందే




భద్రాచలం: శ్రీరామరక్షా స్తోత్రం పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు, ఇల్లెందు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు, చర్లలో నిరసన ప్రదర్శన..

**జమ్మూకాశ్మీర్‌లో భారతీయులను హత్య చేసిన ఉన్మాదులపై, ఈ ఘాతుకానికి వారిని ప్రేరేపించిన ఉగ్రవాదంపై కేంద్రప్రభుత్వం ఉక్కుపాదం మోపాల్సిందేనని, ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా తగిన గుణపాఠం చెప్పాల్సిందేనని అశ్వారావుపేటలోని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రముఖులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదుల హత్యాకాండను నిరసిస్తూ చాంబర్ ఆఫ్ కామర్స్, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు శనివారం జయప్రదంగా, ప్రశాంతంగా సాగింది. జాతీయ పతాకాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మన దేశం గడ్డపై ఉగ్రవాదానికి, ఉగ్రవాదులకు తావు లేదని-ఉండదని విస్పష్టంగా చెప్పాల్సిన సమయం ఇదేనని అన్నారు.**

**– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 26**




అశ్వారావుపేట టౌన్: జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, పాల్వంచలో దిష్టిబొమ్మ దహనం, అశ్వారావుపేట టౌన్: షాపులు మూసివేసిన దృశ్యం

## 'విద్యుత్' పరిష్కారానికి కొత్త ఫీచర్

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 26: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌తోపాటుగా వాట్సాప్ ఫీచర్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ తీసుకొచ్చిందని భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ ఎస్ఈ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

## పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

పాల్వంచ, ఏప్రిల్ 26: విద్యాశాఖ సమగ్ర శిక్షలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 2,300 మంది పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను తిరిగి విధుల్లో తీసుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన శనివారం పాల్వంచలో సీఆర్పీలతో మాట్లాడారు. నాయకులు బట్టు చందర్‌లాల్, ప్రభాకర్, శ్రీనివాస్, కిషన్, గంగరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 26: విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏరియా సింగరేణి హైస్కూల్‌లో 7, 8, 9 తరగతుల వారికి , ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

## మహిళ ఆత్మహత్య

అశ్వారావుపేట, ఏప్రిల్ 26: ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఏపీ లోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెద్దరావిగూడెం గ్రామస్తురాలు కొనకళ్ళ ఏసులక్ష్మి(40) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె హైదరాబాద్‌లోని ఒకరి ఇంట్లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నది. అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో సహ జీవనం చేస్తున్నది. ఈ విషయం ఆమె కుటుంబీకులకు తెలిసింది. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన ఆమెను.. సహజీవనం విషయమై కుటుంబీకులు శుక్రవారం నిలదీశారు. దీనిని తట్టుకోలేని ఆమె, అశ్వారావుపేట మండలం బండారుగూడెంలోని తన మేనమామ ఇంటికి వచ్చి, పురుగుల మందు తాగింది. ఆమెను బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడే శనివారం మృతిచెందింది. ఆమె పెద్ద కుమార్తె నిఖిల ఫిర్యాదుతో కేసు నమోదైంది. అదనపు ఎస్సై రామ్మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుల సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 26: ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన మండలంలోని17 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బీఆర్ఎస్ నాయకులు శనివారం శాలువాలు కప్పి సన్మానించారు. యూఎస్ ప్రకాశ్ రావు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సంకా ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, దారా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజుపేటలో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 26: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట ప్రాథమిక పాఠశాలలో సింగరేణి వైద్య శిబిరం, సింగరేణి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద శిబిరం నిర్వహించారు. 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మణుగూరు ఓసీ పీవో బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి భాస్కర్‌రావు, స్టాఫ్‌నర్స్ భవాని, సిబ్బంది నాగసాయి, భాను ప్రసాద్, ఆశా వర్కర్ భూక్యా గౌరి పాల్గొన్నారు.

## ఎస్‌డీఆర్ఎఫ్ ప్రారంభం

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 26: ఇటీవల ఆరవ బెటాలియన్ పోలీస్ సిబ్బంది దాదాపుగా వందమంది.. తమిళనాడు, ఒడిస్సా, విజయవాడలోని ఎన్‌డీఆర్ఎఫ్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకుని తిరిగొచ్చారు. వీరితో కూడిన బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్‌ను తెలంగాణ ఎస్‌డీఆర్ఎఫ్ నోడల్ ఇన్‌చార్జి ఎన్‌వీ సత్యశ్రీనివాసరావు, బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీధర్‌రాజా, బెటాలియన్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ సురేష్ పాడ్యా తదితరులు పాల్గొన్నారు.

## 'సేంద్రియం'తోనే జీవకోటికి మనుగడ


రైతులతో మాట్లాడుతున్న మణుగూరు ఏడీఏ తాతారావు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 26: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తే జీవకోటికి మనుగడ సాధ్యమవుతుందని మణుగూరు ఏడీఏ తాతారావు అన్నారు. శనివారం మండలంలోని సోంపల్లిలో రైతు గాదె నర్సిరెడ్డి యాసంగి పండించాక వరి దుబ్బులు కాల్చకుండా నీరుపెట్టి భూమాతకు అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటపొలాలకు రసాయన ఎరువులు వాడి భూసారం దెబ్బతినేలా వ్యవసాయం చేస్తున్నారని, అలాంటి వ్యవసాయాన్ని చేయడంతో జీవన మనుగడ అంతమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట మార్పిడి చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలని రైతులకు సూచించారు. ఏవో శంకర్, సొసైటీ డైరెక్టర్ రామకొండారెడ్డి, తోకల అనిత, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, రైతులు వెంకట్రామిరెడ్డి, బోరెం శ్రీను, మేకల నాగం పాల్గొన్నారు.

## విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

చర్ల, ఏప్రిల్ 26: మండలంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం, గురుదేవ్ విద్యాలయం, శ్రీవాణీ విద్యానికేతన్ స్కూళ్ల బాధ్యులు విద్యార్థులకు వేసవిలో కంప్యూటర్, కుట్టు శిక్షణ శనివారం ప్రారంభించారు. వివిధ స్కూళ్ల విద్యార్థులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

## ఇంటిపన్నులో 5 శాతం రాయితీ పొందండి

ఇల్లెందు, ఏప్రిల్ 26: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఎర్లీ బర్డ్ స్కీమ్' ద్వారా ఇంటి పన్నులో 5శాతం మినహాయింపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఉందని, సెలవు దినాల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ఇల్లెందు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అంత్యక్రియలకు రూ.10వేలు అందజేసిన రేగా

పినపాక, ఏప్రిల్ 26: మండలంలోని టీ కొత్తగూడెం గ్రామానికి చెందిన శెట్టిపల్లి పాపయ్య (50) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మృతదేహానికి నివాళి అర్పించి దహనసంస్కారాల నిమిత్తం మృతుడి కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి, వాసుబాబు, భద్రయ్య, వర్మ, బుల్లిబాబు, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న రేగా